
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
గురువారం 9 మే 2024



ఈత చెట్లు దగ్ధం

» మూడు గ్రామాల కార్మికులకు నష్టం




దగ్ధమౌతున్న చెట్లు

అయిజ, మే 8: జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం బైనపల్లి గ్రామంలో బుధవారం ఈత చెట్లు దగ్ధమయ్యాయి. వాటి ద్వారా పులికల్, రాజాపూర్, బైనపల్లి గ్రామాలకు చెందిన పది మంది గీత కార్మికులు ఉపాధి పొందుతున్నారు.

376 సర్వే నంబరులో మూడు ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి, 2,321 ఈత చెట్లను పెంచారు. కుట్కనూర్, రాజాపూర్, బైనపల్లి గ్రామాల మధ్యన పాత మారెమ్మ అవ్వ గాలిమారు వాగు సమీపంలో చెట్లకు మంటలు వ్యాపించాయి. మంటలకు గాలి తోడవడంతో చెట్లన్నీ కాలి బూడిదయ్యాయి.

అభివృద్ధిలో అగ్రగామిగా.. నిలుపుతా



ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న మల్లురవి

» పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రతీ గుంటకు సాగునీరందించడమే లక్ష్యం
» పార్టీలకతీతంగా ప్రజా సమస్యల పరిష్కారం
» రెండేళ్లల్లో ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం
» మామిడి ప్రాసెసింగ్ యూనిట్, నిరుద్యోగులకు ఉపాధి
» 'ఆంధ్రజ్యోతి'తో కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నాగర్‌కర్నూల్, మే 8 (ఆంధ్రజ్యోతి): 'నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలతో నా కుటుంబానికి దాదాపు నాలుగు దశాబ్దాల అనుబంధం ఉంది. మరోసారి పార్లమెంట్ ప్రతినిధిగా ఎన్నుకుంటే నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగ్రామిగా నిలుపుతా' అని అంటున్నారు కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి. నియోజకవర్గంలో అణువణువునా తాను మమేకమయ్యానని, రాహుల్ గాంధీని ప్రధానిగా చూడడమే తన లక్ష్యమని చెబుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణలో ఈ ఎన్నికల్లో అద్భుతమైన విజయాలు సాధించగలమనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలు, తన విజన్ గురించి 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం మాట్లాడారు. ఆ వివరాలు..



ప్రశ్న: నియోజకవర్గ అభివృద్ధిపై మీకున్న విజన్ ఏంటి?

మల్లు రవి: పరిశ్రమల స్థాపనకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం చాలా అనువైన ప్రాంతం. కృష్ణానది పరివాహక ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి, నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేయాలనేది నా సంకల్పం. కల్వకుర్తి ఎత్తిపోతల, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు పూర్తయితే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు కూడా నెలకొల్పాలని భావిస్తున్నా. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం తీసుకుంటా. కొల్లాపూర్ ప్రాంతంలో మామిడి తోటలు అధికంగా ఉన్నందున అక్కడి రైతులకు ప్రయోజనం చేకూరేలా మామిడి ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పేందుకు ప్రయత్నిస్తా.

ప్రశ్న: ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది.. ఓటర్ల నుంచి ఆదరణ ఎలా ఉంది?

మల్లు రవి: బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే పరమావధిగా ఐదు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారు. పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే ఐదు అమలవుతున్నాయి. ఎన్నికల కోడ్ కారణంగా కొంత ఇబ్బంది కలిగినా.. పోలింగ్ ఫలితాలు వెలువడిన తర్వాత తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం మరింత క్షేత్ర స్థాయిలోకి వెళ్లి ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటుంది. పదేళ్ల రాక్షస పాలన నుంచి విముక్తి కలిగిన తర్వాత ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో అద్భుతాలు ఆవిష్కృతం కానున్నాయి. ఎన్నికల ప్రచారానికి ప్రజలు అడుగడుగునా బ్రహ్మారథం పడుతున్నారు. కచ్చితంగా రెండు లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తాననే నమ్మకం ఉంది.

ప్రశ్న: సాగునీటి రంగంపై ఎలా ముందుకెళ్తారు?

మల్లు రవి: మా సోదరుడు మల్లు అనంత రాములు ఎంపీగా ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించారు. నేను కూడా రెండు సార్లు గెలుపొందాను. సాగునీటి రంగం విషయంలో ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయం కారణంగా వలసలకు ఆలవాలమైంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన జలయజ్ఞంలో భాగంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం నిర్మాణానికి నోచుకుంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కూడా కాంగ్రెస్ హయాంలోనే అంకురార్పణ జరిగింది. దాదాపు నాలుగు దశాబ్దాలపాటు ఈ ప్రాంత రైతాంగంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టి, ప్రతీ సెంటు, గుంటకు సాగునీరందించడమే లక్ష్యంగా వ్యవహరిస్తా.

ప్రశ్న: ప్రజా సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

మల్లు రవి: ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాల గురించి మాట్లాడాలనేది నా అభిమతం. ప్రజాప్రతినిధిగా ఎన్నికైన తర్వాత అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే పరమావధిగా భావిస్తా. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కేవలం పార్టీ కార్యకర్తలకు, వారి అనుచరులకు మాత్రమే పని చేసి ఇతరులను పీడించినందుకే రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. సమస్యలతో వచ్చిన ప్రతీ ఒక్కరిని అక్కున చేర్చుకొని, శాయశక్తుల ఆదుకుంటా.

ప్రశ్న: మీకు ప్రధానమైన పోటీ ఎవరితో ఉంటుందని భావిస్తున్నారు?

మల్లు రవి: ఆ భావన నాకు అస్సలు లేనే లేదు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్‌ఎస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు ఏమాత్రం లేదు. దేవుళ్ల పేరిట విభజన సృష్టించి తద్వారా తిరిగి అధికారంలోకి రావడానికి బీజేపీ చేస్తున్న కుయుక్తులను జనం గమనిస్తున్నారు. అధికారం ఉన్నా లేకపోయినా జనం మధ్యన తిరిగే నాకు గెలుపు నల్లేరు మీద నడకలాంటిదే.

ఊసరవెల్లి రంగులు మారిస్తే.. రేవంత్‌రెడ్డి తారీఖులు మారుస్తాడు

» మాజీ మంత్రి కె.తారక రామారావు » అచ్చంపేట, కల్వకుర్తిలో బీఆర్‌ఎస్ రోడ్ షో



అచ్చంపేట రోడ్ షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

అచ్చంపేట/కల్వకుర్తి, మే 8: పచ్చి అబద్ధాలు చెబుతున్న కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ఆరు గ్యారెంటీల అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి డిసెంబరు తొమ్మిది తారీఖున రుణమాఫీ చేస్తానని ఊసరవెల్లి రంగులు మిర్చినట్లుగా రేవంత్ రెడ్డి తారీఖులు మారుస్తాడని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. బుధవారం పట్టణంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాన రహదారిపై బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి రోడ్ షోలో పాల్గొన్ని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలు కాంగ్రెస్ ప్రజల మోచేతికి బెల్లం పెట్టి ఓట్లు వేయించుకున్నారని, 100 రోజుల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదని విమర్శించారు. రైతులకు రూ. 2లక్షల రుణమాఫీతో పాటు రైతు బంధు ఇవ్వడం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రేవంత్ రెడ్డి బీజేపీలోకి మారుతారని ఆరోపించారు. విద్యావంతుడు ప్రవీణ్ కుమార్‌ను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలు ఆశీర్వదించి 10నుంచి 12 స్థానాల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే ఆరు నెలల్లో కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తాడన్నారు. మోదీ పాలనలో 2కోట్ల ఉద్యోగాలు రాలేదని, బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొడుతుంది తప్ప అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు పార్టీకి వెన్నుపోటు పొడిచి బీజేపీలో చేరారని, ఎందుకు చేరారో అచ్చంపేట ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం రద్దవుతుందన్నారు. సీనియర్ నాయకులు అభిలాష్‌రావు, మునిసిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కష్టాలు కన్నీళ్లే: ఆర్‌ఎస్‌పీ

సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు కష్టాలు, కన్నీళ్లే మిగిలాయని నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. గత బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు, రైతుబంధు, రైతుబీమా, ఇంటి వద్దకే నీళ్లు, 24గంటల ఉచిత కరెంటు అందేవన్నారు. కల్వకుర్తి పట్టణంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్ షోకు మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్‌లు హాజరు కాగా రోడ్ షో అట్టహాసంగా కొనసాగింది. ఈ సందర్భంగా హైదరాబాద్ చౌరస్తాలో జరిగిన రోడ్‌షోలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. ప్రజలకు బంజారా భాషలో అభివాదం తెలిపారు. ప్రలోభాలకు లొంగకుండా ప్రజలంతా కారు గుర్తుపై ఓటు వేసి తనను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ శ్రేణులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేసి ప్రతి బూత్‌లో బీఆర్‌ఎస్‌కు మెజార్టీ తీసుకురావాలని కోరారు. ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వెల్దండ జడ్పీటీసీ విజితా రెడ్డి, దశరథ్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు సింగం విజయ్‌గౌడ్, కొండూరు గోవర్ధన్, శ్రీనివాస్‌యాదవ్, అర్జున్‌రావు, నిర్మలా, కల్వకుర్తి నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్‌శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తా

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి



ఆవంచలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ మల్లురవి

తిమ్మాజిపేట/కొల్లాపూర్, మే 8 : ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిలతో కలిసి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామని పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించి గెలిపించండి అని ప్రజలను ఆయన కోరారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని ఆవంచలో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు, కులమతాలకతీతంగా ప్రతీ పేదోడికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. సామాజిక న్యాయమే లక్ష్యం అంటూ గొప్పలు చెప్పిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అసత్య ప్రచారాలు చేస్తూ సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా మాట్లాడడం ఎంత వరకు సమంజసమన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులను చిత్తుగా ఓడించి కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు తెలపాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా ఆగస్టు 15వరకు ఏకకాలంలో రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల అనంతరం గ్రామాల్లో తిరుగుతామని నిరుపేదలను గుర్తించి ఇంది రమ్మ ఇళ్లు వంటి మరెన్నో గ్యారెంటీ పథకాలను లబ్ధి దారులకు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక డాక్టర్ మల్లురవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి ప్రజలను కోరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయ కులు శ్రీనివాస్‌బహదూర్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బాలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉస్మాన్, లక్ష్మీనారాయణ, శ్రీశైలం, పరమేశ్వర్, వెంకట్రా ములు, నాగసాయిలు, వివేక్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, సహదేవ్, వరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం

కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సమన్యాయం చేకూరుతుందని కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లురవి పేర్కొన్నారు. బుధవారం రాత్రి కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి మైనార్టీ నాయకులతో సమావేశమయ్యారు. దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం మైనార్టీలకు చేసిందేమి లేదని, రాష్ట్రంలో కేసీఆర్ మైనార్టీలకు రిజర్వేషన్లు ఇస్తామని వాటిని అమలు పర్చలేదని వారు పేర్కొన్నారు. ఆది నుంచి మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తూ వచ్చిందని, ఎంపీ ఎన్నికల్లో తనను గెలిపించాలని మల్లు రవి కోరారు. అనంతరం కొల్లాపూర్ పట్టణంలో కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశమై ఎంపీ ఎన్నికల్లో చేపట్టాల్సిన పని విధానాన్ని దిశా నిర్దేశం చేశారు.

ఈదురు గాలులు... చిరు జల్లులు

- కాస్త తగ్గిన ఎండవేడిమి

మహబూబ్‌నగ ర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల/వనపర్తి అర్బన్ మే 8 : ఉమ్మడి జిల్లాలో ఎండవేడిమికి ఉక్కిరిబిక్కిరైన జనాలకు రెండ్రోజులు ఈదురుగాలులు, చిరుజల్లులతో వాతావరణం కొంత చల్లబడింది. దీంతో ప్రజలకు ఎండవేడిమి నుంచి కాస్త ఊరట లభిస్తోంది. మంగళవారం రాత్రి బలమైన ఈదురుగాలులతో పాటు జిల్లాలో అక్కడక్కడ చినుకులు పడ్డాయి. కోయిలకొండ మండలంలో 1.5 మి.మీ, పాలమూరులో 0.3 మి.మీ., హన్వాడలో 0.4 మి.మీ., గండీడ్‌లో 0.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇక బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లిలో 43.2, గద్వాల 42.7, కేటీదొడ్డిలో 42.5, అలంపూర్‌లో 42.3, ధరూర్‌లో 42, అయిజలో 41.9, ఉండవెల్లిలో 41.5, ఇటిక్యాలలో 41.1, రాజోలిలలో 41.1, మానవపాడు, మల్దకల్‌లో 40, గట్టులో 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వనపర్తి జిల్లా ఆత్మకూరులో 42.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. చిన్నంబావి 42.0, కొత్తకోట, శ్రీరంగాపురం 41.1, అమరచింత 40.8, పెబ్బేరు 40.6, పాన్‌గల్ 40.3, ఘణపూర్, పెద్దమందడి 40.2, మదనాపురం 40, వీపనగండ్ల 39.9, గోపాల్‌పేట 39.8, వనపర్తి 39.6, రేవల్లి 39.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లిలో 42.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఉప్పునుంతలలో 41.5, పెద్దకొత్తపల్లిలో 41.5, వంగూరులో 41.2, కొల్లాపూర్‌లో 41.0, కోడేరులో 40.9, చారకొండలో 40.7, అచ్చంపేటలో 40.6, బల్మూరులో 40.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యా యి. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలో 40.5 డిగ్రీలు, సీసీకుంటలో 40.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా, మూసాపేటలో 40, మిడ్జిల్, కౌకుంట్ల, దేవరకద్రలో 39.8 డిగ్రీలు నమోదయ్యాయి. నారాయణపేట జిల్లా కోస్గి మండలంలో 39 డిగ్రీలు, మక్తల్‌లో 39 డిగ్రీలు, నర్వలో 38 డిగ్రీలు, కృష్ణలో 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



గాధిర్యాల్ గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

తడిసిన ధాన్యం

మహమ్మదాబాద్ : అకాల వర్షం రైతులకు కన్నీరే మిగ్చింది. బుధవారం సాయంత్రం మండలంలో వర్షం కురిసింది. దాంతో గాధిర్యాల్ గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

దెబ్బతిన మామిడితోటలు

బాలానగర్: బాలానగర్ మండలంలో మామిడి తోటలు పక్షికంగా దెబ్బతిన్నాయి. సుమారు 124ఎకరాల విస్తీర ణంలో 22 మంది రైతులకు నష్టం వాటిల్లినట్లు రైతులు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. జడ్చర్ల హార్టికల్చర్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పించాలని వేడుకున్నారు.

గట్టు : మండలంలోని రాయపురం, మాచర్ల, గట్టు, ఇందువాసి తదితర గ్రామాల్లో వీచిన ఈదురు గాలులకు మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. చెట్లకు కాసిన మామిడి కాయలు నేలకురాలాయి. అదేవిధంగా చిన్నపాటి నివాస గుడిసెలు దెబ్బతిన్నాయి. గట్టు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న రైస్ మిల్లు షెడ్డు గాలికి కూలిపోయాయి. దాంతో రైస్‌మిల్లు యాజమాని అంబూసకు రూ. 10 లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు.



కూలిపోయిన గట్టు సమీపంలో నిర్మాణంలో ఉన్న రైస్ మిల్లు పరికరాలు

పిడుగుపాటుకు ఆవు మృతి

ఊర్కొండ: పిడుగుపాటుకు ఆవు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో చోటు చేసుకుంది. బాధిత రైతు బండి శ్రీశైలం తెలిపిన వివ రాల ప్రకారం మండల కేంద్రంలో మంగళవారం సా యంత్రం నుంచి రాత్రి వరకు ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో పొలంలో బండికి ఆవును కట్టేసి ఇంటికి వచ్చాడు. బుధవారం వెళ్లి చూడగా అప్పటికి ఆవు మృతి చెందిందని వాపోయాడు. ఆవు విలువ సుమారు రూ. 60 వేల ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.



ఊర్కొండలో పిడుగుపాటుకు మృతి చెందిన ఆవు

అట్టహాసంగా రెడ్‌క్రాస్ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న లయన్ నటరాజ్

మహబూబ్‌నగర్‌విద్యావిభాగం, మే 8 : అంతర్జాతీయ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా రెడ్‌క్రాస్ సంస్థకు వలంటీర్లు ఉన్నరని తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకులు జాన్ హెన్రీ డూన్ హంట్ జయంతి సందర్భంగా యన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళ్లు అర్పిం చారు. కార్యక్రమంలో బాబుల్‌రెడ్డి, అశ్వని చంద్రశేఖర్, అశోకుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

మహమ్మదాబాద్, మే 8 : మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ మండల కేంద్రం లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒక ఇసుక ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలకేంద్రంలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకొని డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓట్లు వేయొద్దు

- మాజీ ఐఏఎస్ ఆఫీసర్ ఆకునూరి మురళి



కల్వకుర్తిలో మాట్లాడుతున్న మాజీ ఐఏఎస్ ఆఫీసర్ ఆకునూరి మురళి

కల్వకుర్తి, మే 8 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు ఓట్లు వేయొద్దని మాజీ ఐఏఎస్ ఆఫీసర్ ఆకునూరి మురళి కోరారు. జాగో తెలంగాణ (టీఎస్‌బీఎఫ్)ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర బుధవారం రాత్రి కల్వకుర్తికి చేరుకుంది. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ చౌరస్తాలో జరిగిన సమావేశంలో ఆకునూరి మురళి మాట్లాడారు. అబద్ధపు, విష విభజన రాజకీయాలను ఓడించాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ మోదీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలుపర్చలేదని, దీంతో నిరుద్యోగ సమస్య తీవ్రమైందన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 1న హైదరాబాద్‌లో ప్రారంభమైన జాగో తెలంగాణ బస్సుయాత్ర 11వ తేదీన ముగుస్తుందన్నారు. ప్రజలు మద్యానికి, డబ్బుకు అమ్ముడుపోకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆకునూరి మురళి కోరారు. ప్రొఫెసర్లు లక్ష్మీనారాయణ, పద్మజ, వినయ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి ఓల్వో బస్సు బోల్తా

- ఇద్దరు ప్రయాణికులకు గాయాలు



బస్సు ప్రమాదాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అడ్డాకుల, మే 8: అదుపు తప్పి ఓల్వో బస్సు బోల్తా పడగా ఇద్దరి ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల స్నేహఫామ్ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బెంగుళూరు నుంచి 17మంది ప్రయాణికులతో మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు బయలు దేరిన ఆరెంజ్ ఓల్వో బస్సు అడ్డాకులకు రాగానే అదుపు తప్పి బోల్తా పడింది. దాంతో వంశీ, ప్రగ్నా అనే ఇద్దరు ప్రయాణికులకు గాయాలు కాగా, ఎల్అండ్‌టీ సిబ్బంది, పోలీసులు అంబులెన్స్‌లో మహబూబ్ నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మిగతా ప్రయాణికులను అదే కంపెనీకి చెందిన మరో వాహనంలో హైదరాబాద్‌కు పంపారు. కాగా, బస్సు ప్రమాద సంఘటనతో ప్రయాణికులు తీవ్ర భయభ్రాంతులకు గురైయ్యారు. ప్రాణనష్టం జరగకపోవడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసులు పరిశీలించారు. ప్రయాణికుడు వంశీ ఫిర్యాదుతో డ్రైవర్ రత్నంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నగదు, మద్యం పట్టివేత



ఖిల్లాఘణపురంలో పట్టుబడిన మద్యం కాటన్లతో ఎస్ఐ శ్రీహరి

బాలానగర్, మే 8: మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసుల వాహనాల తనిఖీలు చేపట్టారు. కర్ణాటక రాష్ట్రం చ్ఛిల్లాపూర్‌కు చెందిన నారాయణ స్వామి అనే వ్యక్తి వద్ద ఉన్న రూ. 50,010 ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు. పట్టుబడిన డబ్బులకు సంబంధించి ధ్రువపత్రాలను చూయించి తిరిగి తీసుకోవచ్చని ఎస్సై సూచించారు.

ఖిల్లాఘణపురం శివారులో..

ఖిల్లాఘణపురం : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని శివారు ప్రాంతంలో బుధవారం అక్రమంగా నిల్వ చేసిన మద్యం సీసాలను పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. భూత్పూర్ మండలం కరివేన గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ అనే వ్యక్తి మహబూబ్ నగర్ ప్రధాన రహదారి రైస్ మిల్ పక్కన ముళ్ల పొదల్లో 12 బీర్ కాటన్లు, నాలుగు ఫుల్ బాటిల్‌లు, ఆరు ఆఫ్ బాటిళ్ల మద్యం సీసాల కాటన్లను వాహనంలో తరలించడానికి సిద్ధంగా ఉండగా విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేసి సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సుమారు రూ. 30వేల విలువ గల 98.85 లీటర్ల సామార్థ్యం గల మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అక్రమంగా మద్యాన్ని తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వివరించారు.

తలుపునూరు గ్రామంలో..

రేవల్లి : వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని తలుపునూరు తండాకు చెందిన మూడవత్ రేఖ్య బుధవారం ఉదయం సారాను విక్రయించేందుకు తీసుకెళ్తుండగా పోలీసులు మార్గం మధ్యలో పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతిరెడ్డి తెలిపారు.

సరిహద్దు మండలాల్లో ఇసుక దందా

- ఉదండాపూర్ రిజర్వాయర్‌లో ఫిల్టర్ ఇసుక తయారీ



ఇసుకను తరలిస్తున్న టిప్పర్(ఫైల్)

నవాబ్‌పేట,మే 8: మండలాల సరిహద్దులో ఉన్న ఉదండాపూర్ రిజర్వాయర్‌లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డాగా మారింది. ఇది రెండు మండలాలు (నవాబ్‌పేట, జడ్చర్ల) సరిహద్దులో ఉండటం తో ఇసుక వ్యాపారులు రాత్రి పగలు తేడా లేకుండా ఫిల్టర్ ఇసుక తయారు చేస్తూ ఇతర ప్రాంతాకు తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. జడ్చర్ల మండలం లోని ఉదండాపూర్, ఒల్లూర్, ఖానాపూర్ నవాబ్‌పేట మండలంలోని కారుకొండ, సిద్దోటం, తీగలపల్లి గ్రామాల మధ్య ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ రిజర్వాయర్‌లో వివిధ గ్రామాలకు చెందిన ఇసుక వ్యాపారులు దూరంగా ఇసుక మట్టి తీసుకువచ్చి ఇక్కడ తయారు చేసి ఫిల్టర్ ఇసుకను జడ్చర్ల, మహబూబ్ నగర్ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ పనులు నిలిచి పోవడం రిజర్వాయర్ గుంతల్లో పుష్కలంగా నీరు ఉండటంతో టిప్పర్ల ద్వారా మట్టి తీసుకు వచ్చి కడిగి ఇసుకగా మార్చి వివిధ ప్రాంతాలను నాణ్యమైన ఇసుక పేరుతో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అయితే జడ్చర్ల పోలీసులు ఇక్కడకు వచ్చినప్పుడు ఇది మీ పరిధి కాదు నవాబ్‌పేటకు వస్తుందని చెప్పి వారిని తిప్పి పంపుతున్నారని, నవాబ్‌పేట పోలీసులు వస్తే జడ్చర్ల పోలీసుల పరిధి అంటూ దాట వేస్తున్నట్టు సమాచారం. దీంతో రెండు మండలాల పోలీసులు సరిహద్దు ప్రాంతం మనకెందుకులే అన్నట్టు వెనక్కి తగ్గుతున్నట్లు తెలిసింది. వ్యాపారులు తమ వ్యాపారాన్ని అడ్డు అదుపు లేకుండా సాగిస్తున్నట్లు సమాచారం. పోలీసు అధికారులు స్పందించి ఇసుక అక్రమ వ్యాపారాన్ని అరికట్టాలని కోరుతున్నారు. అలాగే రిజర్వాయర్ గుంతల్లో మొరం, ఎర్రమట్టిని రాత్రివేళల్లో కొందరు వ్యక్తులు పక్క గ్రామాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. ఇదే విషయమై నవాబ్‌పేట ఎస్ఐ అభిషేక్ రెడ్డిని వివరణ కోరగా ఇసుక తరలింపు తమ దృష్టికి రాలేదని ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేంద్రంలో కాంగ్రెస్ వస్తే రాష్ట్రానికి ఎక్కువ నిధులు

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి



మహమ్మద్ హుస్సేన్‌పల్లిలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

అడ్డాకుల, మే 8 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి అధికారంలోకి వస్తే రాష్ట్ర పథకాల అమలుకు ఎక్కువ నిధులు వస్తాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి అన్నారు. బుధవారం మూసాపేట మండల పరిధిలోని మహమ్మద్‌హుస్సేన్‌పల్లిలో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్రంలో ఐదు గ్యారెంటీలు అమలు అవుతున్నాయని అన్నారు. మహమ్మద్‌హుస్సేన్‌పల్లిని ఘణపూర్ మండలంలో కలుపుతామని, ఘణపూర్ నుంచి బీటీ రోడ్డు, గ్రామంలో సీసీ రోడ్లు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు తప్ప బీఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు. గ్రామంలో స్కూల్, ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో స్టేట్ ఏబీసీ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యారెడ్డి, వనపర్తి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.రాజేంద్రప్రసాద్ యాదవ్, కిరణ్‌కుమార్, ఐ.సత్యారెడ్డి, యాదయ్య, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

- **పీఎం శ్రీ యోజనకు ఉమ్మడి జిల్లాలో 115 పాఠశాలలు ఎంపిక**
- **ఒక్కో పాఠశాలకు ప్రతీ ఏటా రూ. 40 లక్షల చొప్పున నిధులు**
- **ఐదేళ్లపాటు కొనసాగింపు**
- **కార్పొరేట్ తరహాలో బోధన, వసతులకు చర్యలు**

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 8 : కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ రానుంది. కార్పొరేట్ పాఠశాలల వసతులు కల్పించే విధంగా సర్కార్ బడులు బలోపేతం కానున్నాయి. ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా (పీఎంశ్రీ) యోజనను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుంది అందులో భాగంగా విడతల వారీగా పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రెండు విడతలుగా పాఠశాలలను ఎంపిక చేశారు. మొదటి విడతలో 69, రెండవ విడతలో 46 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందకు ఎంపికైన పాఠశాలల అభివృద్ధికి రెండు కోట్ల ఖర్చు చేయనున్నారు. ఐదేళ్ల పాటు పాఠశాలల్లో ఈ కార్యక్రమం కొనసాగనుంది. ప్రతీ ఏటా పాఠశాలకు రూ. 40లక్షలు మంజూరు కానున్నాయి. ఈ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, డిజిటల్ గ్రంథాలయం, ఇంటర్‌నెట్, ప్రయోగశాలు, కెరియర్ గైడెన్స్ విద్యార్థులకు కల్పించడం, క్రీడల పట్ల



రాజాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వేసిన రంగులు



వెన్నచెడ్‌లోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పనులు

ఆసక్తి పెంచేందుకు ఆదునాతన సౌకర్యలతో క్రీడాసామగ్రి, సోలర్, విద్యుత్ ఫ్యానల్ ఏర్పాటు, పాఠశాలల స్థాయి నుంచే విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులు అమలు, పలు రకలైనా సౌకర్యాలు కల్పిస్తారు.

● ఎంపికైన పాఠశాలల పేరు మార్పు

ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా కింద ఎంపికైన పాఠశాలల పేరు ముందు పీఎంశ్రీ పాఠశాల అని పేరు ముందు తప్పని సరిగా ఉంచాలని ఇప్పటికే అన్ని పాఠశాలలకు ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో 3,340 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా మొదటి విడతలో గతేడాది చివరలో మహబూబ్‌నగర్ జిల్లాలో 17 , నాగర్‌కర్నూల్ 17 , నారాయణపేట 12, జోగుళాంబ గద్వాల 12 , వనపర్తి 11 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటికి నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నారు. రెండ విడత కింద 46 పాఠశాలలను ఎంపిక చేశారు ఇందులో ప్రాథమిక ఉన్నత , గురకుల, కేజీబీవీలు ఉన్నాయి.

ప్రభుత్వ ఆదేశానుసారం పనులు

ఎంపికైన పాఠశాలలను ప్రభుత్వ ఆదేశానుసారంగా మౌలిక వసతులు తదితర పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. అన్ని వసతులు కల్పించే విధంగా దృష్టి పెట్టాం. పాఠశాలను అందంగా తీర్చిదిద్దుతాం. మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తాం.

- ఎ.రవీందర్ డీఈవో, మహబూబ్‌నగర్

రిజర్వేషన్లు కాపాడుకుందాం

- తెలంగాణ రాష్ట్ర మాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్

నాగర్‌కర్నూల్ టౌన్, మే 8: దేశ వ్యాప్తంగా 400 సీట్లు గెలిస్తే భారత రాజ్యాంగాన్ని మారుస్తామన్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రిజర్వేషన్లను కాపాడుకుందామని తెలంగాణ రాష్ట్ర మాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ పిలుపునిచ్చారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి నివాసంలో తెలంగాణ రాష్ట్ర మాల జేఏసీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం రక్షించాలంటే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌ను బలపరుచాలన్నారు. మోదీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ప్రతీ పేదవాడి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని అమలు నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాలలను ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చిందన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల్లో మాల జేఏసీ కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవికి సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని మాలలంతా ఏకమై కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి చిన్నవెంకటేష్, తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు తైలి వెంకటస్వామి, నాయకులు అనిల్, దాసరి భాస్కర్, చింతసత్తి, దాసరి చెన్నయ్య, మల్లయ్య, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర మాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్

బాలుడిపై వీధి కుక్కల దాడి

గట్టు, మే 8 : చిన్నపిల్లలపై వీధికుక్కలు దాడి చేస్తున్నాయి. దాంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం గద్వాల జిల్లా గట్టు మండలం తప్పెట్లమొర్సు గ్రామంలో ప్రవీణ్ అనే బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. తొడపై కుక్కలు కరవడంతో రక్త గాయమైంది. బాలుడిని తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అధికారులు స్పందించి గ్రామంలోని వీధి కుక్కలను తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

వెల్దండ, మే 8 : మండలకేంద్రం సమీపంలో హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరానికి చెందిన చాకలి రమేష్ కల్వకుర్తిలో ఓ శుభకార్యానికి హాజరై కారులో తిరిగి వెళ్తుండగా వెల్దండ సమీపంలో వెనుక నుంచి అంబులెన్స్ వచ్చి ఢీకొన్నది. దీంతో కారు బోల్తాపడి అందులో ఉన్న రమేష్, అత్త సత్యమ్మ, మామ రాంచంద్రయ్యలకు గాయాలయ్యాయి. దీంతో రమేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి తెలిపారు.

కారు బీభత్సం

హన్వాడ మే 8: మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని నాయినోనిపల్లిలో బుధవారం మధ్యాహ్నం కారు బీభత్సం సృష్టించింది. ఆగి ఉన్న వాహనాలను ఢీకొట్టడంతో ఆటో, స్కూటీ, రెండు మోటార్ సైకిళ్లు ధ్వంసమయ్యాయి. మహబూబ్‌నగర్ నుంచి దౌల్తాబాద్ వెళ్తున్న కారు మైనంపల్లి గ్రామ స్టేజీ వద్ద ఆగి ఉన్న మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో సల్లోనిపల్లి గ్రామానికి చెందిన తిరుపతి, రాజులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా కారు నడపడంతో వల్ల ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఎక్కువగా ప్రజలు ఉండే ప్రాంతంలో అయితే ప్రాణనష్టం జరిగేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

నేడు బీడీ కార్మికుల వేతనాల పెంపుపై చర్చలు

చిన్నచింతకుంట, మే 8: ఉమ్మడి జిల్లాలో బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటుగా వేతనాల పెంపుపై గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బీడీ కార్మిక సంఘం ప్రతినిధులు, బీడీ ఫ్యాక్టరీల యజమాలతో చర్చలు జరుగనున్నట్లు టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, నాయకులు యాదగిరి బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. వేతనాలతో పాటుగా పీఎఫ్, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. గత రెండేళ్ల క్రితం జరిగిన ఒప్పందంలో గ్రాట్యుటీ విషయంలో బీడీ పరిశ్రమల యజమానులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం వల్ల అనేక మంది కార్మికులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వేళ డిమాండ్లు అంగీకరించని యెడల ఆందోళనకు సిద్ధమవుతాయని తెలిపారు.

మృత్యువాత పడుతున్న
ఆదిత్య గ్రేటర్ ఫ్లెమింగో పక్షులు



విద్యుత్ ఘాతానికి మృతి చెందిన ఫ్లెమింగో పక్షులను పరిశీలిస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యుడు

కొల్లాపూర్, మే 8 : కృష్ణానది పరి వాహక ప్రాంతంలో 760 కేవీ విద్యుత్ లైన్లకు తాకి మృత్యు వాతపడుతున్న ఆదిత్య గ్రేటర్ ఫ్లెమింగో పక్షులను బుధవారం జన విజ్ఞాన వేదిక టీం సభ్యులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక టీం సభ్యుడు మహ్మద్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట వెంకల్ సమీపంలో 760కేవీ విద్యుత్ లైన్లకు తాకి మృత్యువాత పడుతున్న ఆది త్యగ్రేటర్ ఫ్లెమింగో పక్షులు మృత్యువాత పడుతున్నాయన్నారు. ప్రభుత్వం చొరవ చూపి బర్డ్ ఫ్లై డైవర్ట్ రిఫ్లేక్టర్లను ఏర్పాటు చేయాలని కోరారు. వేసవిలో ఇతర ప్రాంతాల నుంచి కృష్ణానది తీరానికి వలస వచ్చే పక్షులను ప్ర భుత్వం పరిరక్షించాలని వారు కోరారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సభ్యులు రమణ, జలగం మద్దిలేటి ఉన్నారు.

కంపెనీ లేబుల్స్‌తో రైతులకు కుచ్చుటోపీ

- గద్వాల జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన టెక్స్‌మో కంపెనీ లీగల్ అధికారులు

గద్వాల క్రైం, మే 8 : తమ కంపెనీ పేరుతో నకిలీ లేబుల్స్‌తో విక్రయాలు చేస్తూ రైతులకు కుచ్చు టోపీ వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని టెక్స్‌మో కంపెనీ లీగల్ అధికారులు అఫ్జాబ్ సలీం, నాగరాజు కోరారు. బుధవారం గద్వాల జిల్లా ఎస్పీ రితిరాజ్‌కు వారు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ ఇంజనీరింగ్ కో యజమాని విజయకుమారెడ్డి టెక్స్‌మో కంపెనీకి చెందిన పీవీసీ, యూపీవీసీ, డ్రిప్ సామగ్రి తదితర పైపులను నాసిరకం టెక్స్‌మో గోల్డ్‌పేరుతో రైతులకు విక్రయిస్తూ మోసగిస్తున్నారన్నారు. కొన్ని రోజులుగా జిల్లాలోని వివిధ గ్రామాల రైతులకు నాసిరకం వ్యవసాయోతర పైపులను కంపెనీ నిర్ణయించిన ధరల కంటే తక్కువ ధరకు విక్రయాలు చేస్తున్నారన్నారు. ఒరిజనల్ టెక్స్‌మో కంపెనీ పైపులకు ఏ మాత్రం తీసిపోకుండా అలాగే ఉండే టెక్స్‌మో గోల్డ్ ఉండటంతో ఆ కంపెనీ నిర్వాహకులు గుర్తించి రైతులను వాకబు చేశారన్నారు. రైతుల ద్వారా సమాచారం తెలుసుకొని నాసిరకం పైపులను విక్రయిస్తున్న వ్యాపారి విజయ్‌కుమార్‌రెడ్డి గోదామ్‌ను పోలీసుల సహాయంతో సోదాలు చేయగా అందులో రూ. 10లక్షల విలువ చేసే నాసిరకం వ్యవసాయేతర డ్రిప్‌పైపులు, ఇతరత్ర పైపులను గుర్తించామన్నారు. టెక్స్‌మో కంపెనీ పేరుతో నాసిరకం పైపులను రైతులకు విక్రయాలు చేయడంతో పాటు వారిని మోసం చేస్తున్నట్లు వారు తెలిపారు. మార్కెట్‌లో తక్కువ ధరకై పైపులు విక్రయిస్తున్నట్లు రైతుల ద్వారా గుర్తించి లక్ష్మీనారాయణ ఇంజనీరింగ్ కో లిమిటెడ్ నిర్వాహకుడిపై చీటింగ్ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై సీఐ భీమాకుమార్ వివరణ కోరగా ఫిర్యాదుపై విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.



నకిలీ లేబుల్స్ ఉన్న వ్యవసాయేతర వస్తువులను గోదామ్‌లో చూపుతున్న టెక్స్‌మో కంపెనీ లీగల్ అధికారి

చివరి మజిలీకి కష్టాలెన్నో?

- **గద్వాల జిల్లాలో సుమారు రూ.28కోట్లతో వైకుంఠధామాలు నిర్మాణం**
- **కనీస వసతులు తాగునీరు, కరెంటు లేక ఇక్కట్లు**
- **బీటలువారుతున్న కట్టడాలు**
- **మందుబాబులకు అడ్డాలు..**
- **నేటికీ వినియోగంలోకి రాని పలు వైకుంఠధామాలు**

అలంపూర్ చౌరస్తా, మే 8: చివరి మజిలీకి సైతం కష్టాలు తప్పడం లేదు. పలు గ్రామాల్లో శ్మశానమే లేకపోవడంతో మైళ్ల దూరం వెళ్తున్నారు. ఉన్న గ్రామాల్లో శ్మశానాలకు దారిలేక అంత్యక్రియల సమయంలో అష్టకష్టాలు పడుతున్నారు. దాంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ గ్రామానికి వైకుంఠధామాలు నిర్మించాలనే ఉద్దేశంతో మొదట రూ. పది లక్షలు మంజూరు చేసింది. ఆ తర్వాత మరింత నాణ్యత ప్రమాణాలతో పాటు నీరు, కరెంటు, అవసరమైన వసతులు కల్పించాలన్న లక్ష్యంతో మరో రూ. 2.6లక్షలు పెంచి మొత్తం రూ.12.60లక్షలు మంజూరు చేసింది. జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 255 గ్రామపంచాయతీలున్నాయి. ఇందులో ఒకటి రెండు గ్రామాలు మినహా జిల్లాలో అన్ని గ్రామాల్లో సుమారు రూ. 28కోట్లతో వైకుంఠధామాలు నిర్మించారు. ఇందులో పంచాయతీ రాజ్ శాఖవారు 219 వైకుంఠాలు నిర్మించగా, మిగతావన్నీ డీఆర్‌డీఏ పరిధిలో నిర్మించారు. ఇవి పూర్తి అయి సుమారు నాలుగేళ్లు కావస్తుంది. చాలా గ్రామాల్లో నేటికీ వైకుంఠాలు వినియోగంలోకి రాలేదు. వెరసి మందుబాబులకు అడ్డాలు మారాయి. ఇంకా నాణ్యతలేమితో నిర్మాణాలు చేపట్టడంతో బీటలువారుతున్నాయి.

కనీస వసతులేమితో..

వైకుంఠాలలో రెండు దహన వాటికలు, రెండు స్నానపుగదులు, రెండు మరుగుదొడ్లు, చితభస్మాలు, అంత్యక్రియాలకు అవసరమయ్యే సామగ్రిని ఉంచుకునేందుకు ఒక గది, ఒక విశ్రాంతి గదితో పాటు తాగునీరు, విద్యుత్ ఏర్పాటు చేయాల్సి ఉంది. నిర్మాణాలు కట్టి వదిలేశారు తప్ప అందుకు అవసరమైన కరెంటు, నీరు చాలా చోట్ల ఏర్పాటు చేయాల్సి ఉంది. ఊరికి దగ్గర ఉన్నవాటికి మిషన్‌భగీరథ కనెక్షన్ ఇచ్చారు. దూరం ఉన్న చోట బోరు వేయాల్సి ఉన్నది. కానీ గ్రామపంచాయతీ నిధుల లేమితో బోరువేసేందుకు అప్పటి సర్పంచులు కొంతమంది ముందుకురాలేదు. మరి కొన్ని చోట్ల బోర్లు వేసిన విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడం, మోటారు అమర్చకపోవడంతో వృథాగా మిగిలాయి. మానవపాడు మండలం, చిన్నపోతులపాడు గ్రామంలోని వాటిక భవనాల్లో నిత్యం ఉదయం నుంచి చీకటి పడేవరకు పేకాట ఆడుతున్నారు.



మారమునగాల-2 గ్రామంలో ఉన్న శ్మశాన వాటిక దుస్థితి



కనీసం రోడ్డు సౌకర్యం లేని మారమునగాల శ్మశాన వాటిక

వినియోగమెప్పుడో..?

గ్రామాల్లో నూతనంగా నిర్మించిన చాలా వాటికలు నేటికీ వినియోగంలోకి రాలేదు. సౌకర్యాలులేమి ఒకటైతే శవాన్ని పూడ్చేందుకు అనువుకానీ (గుట్టలు, బండలు, కొండ ప్రాంతాలు) చోట్లు కావడం మరో కారణం. వాస్తుదోషాల వల్ల కూడా కొన్ని వైకుంఠాలు వినియోంలోకి రాలేదని తెలుస్తోంది. చాలా గ్రామాల ప్రజలు ఎవరైనా చనిపోతే పాత శ్మశాన వాటికల్లోనే అంత్యక్రియాలు జరుపుతున్నారు. జిల్లాలో కొన్ని వాటికలకు సీసీ రోడ్లు నిర్మించిన చాలా గ్రామాలలో కనీస రోడ్లు లేవని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. పూడ్చుకుంటూ పోతే భవిష్యత్‌లో స్థలాల కొరత ఏర్పాడే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ముందుచూపుతో ప్రస్తుత వైకుంఠాలు దహనసంస్కరాలకు అనుకూలంగా నిర్మించారు. కానీ దహన అంత్యక్రియాలు కొన్ని మతాలకే పరిమితమనే నమ్మడం వల్ల దహన సంస్కరాలకు కొన్ని మతాల వారు దూరంగా ఉంటున్నారు. ఇలాంటి అనుమానాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం అధికారుల, ప్రభుత్వంపై ఉంది.

సంప్రదాయానుసారం ఏర్పాట్లు చేశాం

గద్వాల జిల్లాల్లో దాదాపు మృతదేహాలను మట్టిలో పూడ్చివేసే సంప్రదాయం ఉంది. ఖననం చేసే సాంస్కృతి ఇక్కడ లేకపోవడం వల్ల చాలా చోట్ల దహనఘాట్లు నిరుపయోగంగా ఉన్నమాట వాస్తవమే. ఇంకా ఎక్కడైనా పాత వాటిలోనే దహన సంస్కారాలు చేస్తుంటే అందుకుగల కారణాలను విశ్లేషించి అవగాహన కల్పించడమా అవసరమైనా ఏర్పాట్లు చేయడమా ఆయా పంచాయతీల స్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

- వెంకట్‌రెడ్డి, డీఎల్‌పీవో, గద్వాల

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణన

-ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అచ్చంపేటటౌన్, మే 8: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణన చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్ని మాట్లాడారు. ముద్దిరాజుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అధికారంలోకి రాగానే బీసీల రిజర్వేషన్లు పెంచాతామన్నారు. ఎంపీ అభ్యర్థి మల్లురవిని గెలిపించాలని కోరారు. సీనియర్ నాయకురాలు వెన్నెల గద్దర్, నాయకులు మోపతయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం'

కొల్లాపూర్, మే 8 : రైతు వ్యతిరేకంగా పని చేసే నల్లచట్టాలను తీసుకొచ్చి దేశ వ్యాప్తంగా రైతులను బలి తీసుకున్న మోదీ ప్రభుత్వానికి ఎంపీ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు రైతులకు సీపీఎం నాయకులకు పిలుపునిచ్చారు. బుధవారం కొల్లాపూర్ మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన రైతు సంఘం సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్రంలో పది సంవత్సరాలు అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం దేశ ప్రజలకు చేసిందేమి లేదని రాముడి పేరుతో రాజకీయం చేస్తూ కులమతాల మధ్య చిచ్చు పెడుతూ కార్పొరేట్ వ్యవస్థలకు పట్టం కడుతూ మోదీ ప్రభుత్వం పబ్బం గడుపుకుందని ఆయన విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి బలపర్చిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి మల్లురవిని గెలిపించాలని, మోదీ ప్రభుత్వానికి మద్దతు పలికే పార్టీలకు కూడా ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని రైతులను కోరారు. రైతు సంఘం మండల కార్యదర్శి బి.బాలపీరు, మండల అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు రాముడు, సీఐటీయూ నాయకులు సలీం, సత్యం పాల్గొన్నారు.

యువకులు రక్తదానం చేయాలి

నాగర్‌కర్నూల్ టౌన్, మే 8: యువకులు రక్తదానికి ముందుకు రావాలని జిల్లా వైద్యాధికారి, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ సుధాకర్‌లాల్ అన్నారు. బుధవారం రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా జిల్లా జనరల్ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 16 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం రెడ్‌క్రాస్ భవన నిర్మాణ కార్మికులకు పండ్లను పంపిణీ చేశారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి రమేష్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీధర్, యూత్ రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ డి.కుమార్, బ్లడ్ డొనేషన్ కన్వీనర్ రాజ్‌కుమార్, రెడ్‌క్రాస్ సభ్యులు కృష్ణారావు, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

'మోదీతోనే పేదల సంక్షేమం సాధ్యం'

పెద్దకొత్తపల్లి, మే 8 : కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వంతోనే పేదల సంక్షేమం సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని చంద్రకల్, వెన్నచెర్ల గ్రామాల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు జరగబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి కమలం గుర్తుపై ఓటు వేసి బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. మండల అధ్యక్షుడు పదిర భీమేష్‌రెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శేఖర్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి తిరుమల్‌యాదవ్, నాయకులు సైదులు, సలేశ్వరం, శివాజీ, శ్రీకాంత్, స్వామి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఒక్క అవకాశమివ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా'

కల్వకుర్తి, మే 8 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా నిలిచిన తనను ఒక్క అవకాశమివ్వాలని, అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. కల్వకుర్తి పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో మాదిగల రాజకీయ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మాదిగల ఆత్మగౌరవ సభ బుధవారం జరిగింది. సభకు ఆర్ఎస్‌పీ హాజరై మాట్లాడారు. తాను గురుకులాల కార్యదర్శిగా పని చేసి ఎంతోమంది పేద విద్యార్థులు చదువుకోవడానికి బాటలు వేశానని తెలిపారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మబ్బుసాయన్నమాదిగ, కల్వకుర్తి నియోజకవర్గంలోని పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

బిజినేపల్లి, మే 8 : మండలంలోని నంది వడ్డెమాన్ గ్రామంలో జియోహెల్త్ కేర్ హస్పిటల్స్, ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైందని నిర్వాహకుడు మ్యాతరి సుదర్శన్ అన్నారు. గ్రామంలో అనారోగ్యానికి గురై ఆర్థిక స్తోమత లేక వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు సేవ చేయాలనే తలంపుతో ప్రతియేటా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేపట్టడంతో పాటు అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో మ్యాతరి సత్యం తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యం

బిజినేపల్లి, మే 8 : అన్ని రంగాల్లో బలహీన వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూచకుళ్ల సుహాసన్ రెడ్డి అన్నారు. మండలంలోని గంగారంలో బుధవారం ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి మల్లు రవికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే శాయిన్‌పల్లిలో కాంగ్రెస్ నాయకురాలు, మాజీ సర్పంచ్ మస్కూరి అవంతి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవికి ఓటు వేయాలని ఇంటింటి ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు.

వట్టెంలో కాంగ్రెస్‌లో చేరిన యాదవులు

బిజినేపల్లి, మే 8 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం గ్రామంలో బుధవారం గ్రామ యాదవ సంఘం సభ్యులు, వడ్డెర సంఘం నాయకులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి మల్లు రవిల సమక్షంలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పాటు పడాలని వారు కోరారు. మాజీ సర్పంచ్ అమృత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు భగవంత్ గౌడ్, సీనియర్ నాయకుడు మాన్యానాయక్ తదితరులు ఉన్నారు.

రైతుల కన్నీళ్లు తుడవడమే కాంగ్రెస్ లక్ష్యం

- యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి



రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న శివసేనా రెడ్డి

ఊర్కొండ, మే 8: రైతుల కన్నీళ్లు తుడవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి అన్నారు. రైతుల ఖాతాలో రైతు భరోసా డబ్బులు జమ చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం మండల కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర రైతన్నలకు ఆర్థికంగా అభివృద్ధి చేయడం కోసం పలు రకాలుగా కృషి చేస్తున్నామని అన్నారు. రైతు భరోసాతో పాటు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తున్నదని తెలిపారు. వచ్చిన ఐదు నెలల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని, కొన్ని చోట్ల ముందుగానే ఎన్నికల కోడ్ రావడంతో అమలు కాలేదని, ఎన్నికల అనంతరం లబ్ధిదారులను గుర్తించి వెంటనే వారికి అందే విధంగా చూస్తామన్నారు.

'బీజేపీని ఓడించాలి'

తాడూరు, మే 8 : ఉపాధి నిధులను తగ్గిస్తూ చట్టాన్ని పూర్తిగా ఎత్తేసే కుట్రలు పన్నుతుందని, ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడానికి కేంద్రంలోని బీజేపీని ఓడించాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ పిలుపునిచ్చారు. బుధవారం తాడూరు మండల పరిధిలోని అంతారం గ్రామంలో చెరువులు పూడికతీత పనుల్లో ఉన్న కూలీల దగ్గరికి ఆయన వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుని అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడారు. తక్షణం కూలీలకు వేతనాలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్ రాములు, నాయకులు శంకర్, డీహెచ్‌పీఎస్ నాయకులు రాము, మైసన్న, లక్ష్మయ్య, బంగారయ్య, కూలీలు వెంకటయ్య కృష్ణయ్య, బాలయ్య, హనుమంతు, జ్యోతి, ఆలివేల, సుగుణమ్మ, సునీత, బాలమణి తదితరులు కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోలింగ్ రోజున మౌలిక వసతులు కల్పించాలి

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : పోలింగ్ రోజున మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోలింగ్ సన్నద్ధతపై అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, సీతారామారావు, డీఎంహెచ్‌వో, ఎస్ఈ ఎలక్ట్రిసిటీ, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్, డీఈవో, డీపీవో, డీడబ్ల్యూవో, మునిసిపల్ కమిషనర్లు జిల్లా అధికారులతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈ నెల 13వ తేదీన నిర్వహించే ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి 12వ తేదీన ఎన్నికల సామగ్రి అందించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఒక్కరోజు ముందుగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, సిబ్బందికి పోలింగ్ సామగ్రిని డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ల ద్వారా అందించి ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, పోలింగ్ సిబ్బంది కోసం తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందికి మంచి భోజన వసతులు కల్పించాలన్నారు. అలాగే ఆయా పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి బస్సుల ద్వారా రవాణా సౌకర్యం ఏర్పాటు చేసి వారిని సంబంధిత పోలింగ్ సెంటర్లకు పోలింగ్ సామగ్రితో సహా ఆయా రూట్లలో రూట్ మ్యాప్ ప్రకారం పోలీస్ బందోబస్తుతో ఎన్నికల కేంద్రాలకు చేర్చాలన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వైద్యారోగ్య శాఖ తరపున ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వివిధ రకాల మాత్రలతో ఆశ, ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వో సుధాకర్‌లాల్‌ను ఆదేశించారు. పోలింగ్ ముందు రోజు నుంచి పోలింగ్ అయిపో యేంత వరకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రతీ పోలింగ్ కేంద్రంలో దివ్యాంగుల సౌకర్యం కోసం ర్యాం పులు, వయోవృద్ధుల కోసం వీల్‌చైర్‌లను అందుబాటులో ఉంచాలని డీడబ్ల్యూవోను ఆదేశించారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో అన్ని మౌలిక వసతులు, టెంటు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతులు ఉండేలా సరిచేసుకోవాలని డీపీవోను కలెక్టర్ ఆదేశించారు.

ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేయాలి

అకాల వర్షాల నేపథ్యంలో అధికారులు ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేయాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల నేపథ్యంలో బుధవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లతో అదనపు కలెక్టర్ సీతారామారావుతో కలిసి కలెక్టర్ ఉదయ్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ మార్పులతో జిల్లాలో అకాల వర్షాల కారణంగా ఎక్కడైనా పంట నష్టం వాటిల్లితే వివరాలను పక్కాగా అందజేయాలని అధికారులకు సూచించారు. వచ్చే రెండు మూడు రోజుల్లో వర్షాలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని చెప్పారు. బలమైన ఈదురుగాలులకు జరిగిన పంట నష్టం, ఆస్తి నష్టం వివరాలను ఎప్పటికప్పుడు నివేదించాలని ఆయన సూచించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలియన్లతో కప్పి ఉంచాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తాం

- కొల్లాపూర్‌లో ప్రజలతో మంత్రి జూపల్లి కృష్ణారావు



కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, మే 8 : కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే తమ బాధ్యత అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 10, 11వ వార్డుల్లో మంత్రి జూపల్లి ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయా వార్డు ప్రజలతో సమావేశమయ్యారు. పదవ వార్డులో కాంగ్రెస్ పార్టీ మునిసిపల్ కౌన్సిలర్ షేక్.రహీంపాష ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం కాంగ్రెస్ పార్టీ తప్పక అమలు చేస్తుందని, ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల కోడ్ ఉండడంతో పథకాల అమలు ఆగిపోయాయన్నారు. ఎన్నికల కోడ్ పూర్తైన వెంటనే తానే స్వయంగా అన్ని ప్రాంతాల్లో తిరిగి అర్హులందరినీ గుర్తించి న్యాయం చేకూరుస్తానని ప్రజా సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి వారికి భరోసానిచ్చారు. ఇల్లులేని ప్రతీ ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్మించి ఇస్తామని, 500రూపాయలకే సిలిండర్ అందజేస్తామని, ప్రతీ నెల 200యూనిట్లు విద్యుత్ వాడిన వాందరికీ ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ఆయన తెలిపారు. ఎంపీ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి పోటీ చేస్తున్నారని భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీని గెలిపించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమిచ్చిన సోనియాగాంధీకి ఎంపీ ఎన్నికల్లో గెలిపించి తెలంగాణ ప్రజలు బహుమతి ఇవ్వాలని ఆయన ఓటర్లను కోరారు. దేశంలో ఇండియా కూటమి అధికారం చేపట్టబోతుందని, బీజేపీ, బీఆర్ఎస్‌లతో ఒరిగేదేమి లేదని రాహుల్‌గాంధీ నేతృత్వంలో దేశవ్యాప్తంగా ఇందిరమ్మ రాజ్యం రాబోతుందని జూపల్లి మహిళలతో పేర్కొన్నారు. వార్డులో నెలకొన్న సమస్యలను విని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. అదేవిధంగా 11వ వార్డుల్లో ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి జూపల్లి పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. పలువురు మహిళలు కాలనీల్లో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వాటిని పరిష్కరిస్తామని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు, కాంగ్రెస్ నాయకులు బొరెల్లి మహేష్, బిజ్జ రమేష్, మస్తాన్, బాబా, శివ, గోపాల్ పాల్గొన్నారు.

వారి పాలనలో ప్రజలు విసిగిపోయారు

- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఏఐసీసీ అబ్జర్వర్ ఎం.రమేష్‌రెడ్డి



నాగర్‌కర్నూల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ అబ్జర్వర్ రమేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, మే 8: బీజేపీ, బీఆర్ఎస్‌ల పదేళ్ల పాలనలో విసిగి పోయిన ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు నిలబడ్డారన్నారు ఏఐసీసీ అబ్జర్వర్ ఎం.రమేష్‌రెడ్డి కోరారు. రెండు పర్యాయాలు ఎంపీగా, ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవంతో ఈ ప్రాంత ప్రజలకు అన్ని వేళలా ఉంటూ వస్తున్న నాగర్‌కర్నూల్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి నివాసంలో దళిత సంఘాల మేధావులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పిన ప్రజలు కేంద్రంలోని బీజేపీని ఓడించడానికి సిద్ధమయ్యారని స్పష్టం చేశారు. అంబేడ్కర్ పూలే జాతర కమిటీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలు భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, రిజర్వేషన్లు మనుగడకు సంబంధించిన ఎన్నికలు అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మతతత్వ రాజకీయాలు చేస్తోందని, అవి దేశానికి ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. మనువాద ఆర్ఎస్ఎస్ పునాదుల మీద పుట్టిన బీజేపీతో మందకృష్ణ మాదిగ అంబేడ్కర్ సిద్ధాంతాలకు తిలోదకాలు ఇచ్చారని విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ రాజకీయ అనుభవ రాహిత్యంతోనే బహుజన వాదాన్ని వదిలేసి కేసీఆర్‌తో జతకట్టారని విమర్శించారు. దేశ వ్యాప్తంగా ప్రజాస్వామ్య వాదులంతా కాంగ్రెస్‌ను బలపరుస్తున్నారని పేర్కొన్నారు. టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి ఇ.రాములు, మాదిగ మహాకూటమి జిల్లా అధ్యక్షుడు బోనాసి రాములు, కౌన్సిలర్ కొత్త శ్రీనివాసులు, దళిత నాయకులు సి.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వార్థ రాజకీయాలను పట్టించుకోం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెల్దండ, మే 8 : కొందరు బీజేపీ నాయకులు స్వార్థపూరితంగా తమను పార్టీకి దూరంచేసే ప్రయత్నాలు చేస్తున్నారని, వీటిని తాము ఎంతమాత్రం పట్టించుకోమని, బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి భరత్‌ప్రసాద్ గెలుపునకు తాము పనిచేస్తామని బీజేపీ మండల నాయకులు తెలిపారు. బుధవారం బీజేపీ మండలస్థాయి సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశానికి బీజేపీ సీనియర్ నాయకుడు యెన్నం విజేందర్‌రెడ్డి, చిందం కృష్ణయ్య, నక్కెరకంటి శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు నాయకులు ఒంటెత్తు పోకడలతో తమ స్వప్రయోజనం కోసం పార్టీకి నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఏళ్ల కాలంగా పార్టీకి పనిచేస్తున్న తమకు ఎటువంటి సమాచారం ఇవ్వడంలేదని పేర్కొన్నారు. స్వార్థ నాయకులను ఎంతమాత్రం పట్టించుకోమని, పార్టీకి నష్టం జరిగితే చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు. కనీసం పార్లమెంట్ అభ్యర్థిని సైతం తమతో కలవనివ్వడంలేదని, ఇదెక్కడిదీరని దుయ్యబట్టారు. తమకు పార్టీ ముఖ్యమని అభ్యర్థి గెలుపునకు కృషిచేసి, భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని విజేందర్‌రెడ్డి, చిందం కృష్ణయ్య, శ్రీనివాసులు పేర్కొన్నారు. సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, నాయకులు చిమ్ముల శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఊపందుకున్న ఇంటింటి ప్రచారం

అమ్రాబాద్, మే 8: పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి మూడు రోజులు మాత్రమే గడువు మిగిలి ఉండడంతో ఎన్నికలలో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థుల తరపున మండల, గ్రామ పార్టీ తరపున ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారంలో నిమగ్నమయ్యారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థుల గెలుపు కోసం ముమ్మరంగా ఆయా గ్రామాల్లోని ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి తమ పార్టీ అభ్యర్థికే ఓటు వేసి గెలిపించాలని వేడుకుంటున్నారు. కాగా అమ్రాబాద్ మండల కేంద్రంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం కూడా ఇంటింటి ప్రచారంలో ఆ పార్టీ శ్రేణులు నిమగ్నమై ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్‌ను గెలిపించి ప్రధాని నరేంద్ర మోదీకి కానుకగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షులు గోలిరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

తెలకపల్లి, మే 8 : గత కొద్ది రోజుల క్రితం తెలకపల్లికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గడ్డమీది శ్రీహరి తండ్రి గడ్డమీది పరుశరాములు మృతి చెందారు. విషయం తెలుసుకున్న నాగం శశిధర్‌రెడ్డి తెలకపల్లి గ్రామానికి చేరుకుని శ్రీహరి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారికి 15వేల ఆర్థిక సహాయం అందజేశారు. అర్థం రవి, భీముడు, లక్ష్మారెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

10 వరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగం

నాగర్‌కర్నూల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ల ద్వారా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు వీలుగా ఎన్నికల సంఘం ఈ నెల 10వ తేదీ వరకు గడువును పొడిగించిందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఈ నెల 8తో గడువు ముగియగా ఎన్నికల సంఘం మరో రెండు రోజులపాటు గడువు పొడిగించిందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు మరో రెండు రోజుల గడువు పెంచిందని తెలిపారు. ఈ నెల 8వ వరకు గడువు ఉండగా మే 10వరకు రెండు రోజుల అవకాశం కల్పించినందున ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక



బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

వెల్దండ, మే 8 : మండల పరిధిలోని అజిలాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మెన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మండల నాయకుల సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు సిద్దగోని రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది గులాబీ గూటికి చేరారు. జడ్పీటీసీ విజితారెడ్డి, మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్, నాయకులు అనిల్‌కుమార్, చంద్రమోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఎడ్మ వెంకట్‌రెడ్డి, నిరంజన్ ఉన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

తెలకపల్లి, మే 8: మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామ బీఆర్ఎస్ నాయకులు కొండల్‌రావు, యాదయ్య, స్వామిరెడ్డి, కేంద్ర మంత్రి మురుగన్ సమక్షంలో బుధవారం బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీప్‌చారి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, మండల కో ఆర్డినేటర్ బాబుసాగర్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఘనంగా వీడ్కోలు

కొల్లాపూర్, మే 8 : కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఘనంగా వీడ్కోలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఇటికల రామారాజుయాదవ్ అధ్యక్షతన జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి కళాశాలతో ఉన్న తమ అనుబంధాన్ని పేర్కొన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ పి.రమేష్‌కుమార్, ఎం.కుర్మయ్యలు విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం సందర్భంగా భోజన సదుపాయం కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎన్.ఉదయ్‌కుమార్, ఆర్.స్వర్ణలత, అధ్యాపకులు పి.వెంకటయ్య, డాక్టర్ పి.రమేష్‌కుమార్, ఎస్.కుర్మయ్య జగన్నాథం, సోఫిపాష, శివుడు, కవిత, వసుంధర, అనిత, బోధనేతర సిబ్బంది మల్లికార్జున్, వనజాకుమారి, తిరుపతయ్య, బాలయ్య, హుసేన్‌బాష, వెంకటస్వామి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దు'

పెద్దకొత్తపల్లి, మే 8 : బీఆర్ఎస్ పార్టీ చెప్పే కల్లబొల్లి మాటలు ప్రజలు నమ్మి మోసపోవద్దని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని మరికల్ గ్రామంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవిని అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. అంతకుముందు గ్రామ సమీపంలో ఉపాధి కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకుని హస్తం గుర్తుకు ఓటు వేయాలని ఆయన కోరారు. చెన్నపురాంపల్లి మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఉప సర్పంచ్ బొల్లె జగన్, నాయకులు ఈశ్వర్, ముచ్చపోతుల శంకర్ ఎండీ.హబీబ్, చంద్రశేఖర్, రాకేష్, ఇమామ్‌గౌడ్, నరేంద్రచారి పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు

అమ్రాబాద్, మే 8: అమ్రాబాద్ మండల పరిధిలోని సార్లపల్లి గ్రామానికి చెందిన ముగిళ్ల సాలమ్మ (40) అనే మహిళ గత నెల 26వ తేదీన ఇంటి నుంచి కనిపించకుండా పోయిందని ఆమె కుమారుడు మధు బుధవారం అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అమ్రాబాద్ ఎస్ఐ రమేష్ విలేకరులకు తెలిపారు. ఈ మహిళ భర్త గతంలోనే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఆమె కుమారుడు హైదరాబాదులో కారు డ్రైవ్ చేస్తూ జీవిస్తున్నాడని ఆయన తెలిపారు. ఈ మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

మల్లురవి సతీమణి ప్రచారం

అచ్చంపేటటౌన్, మే 8: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి సతీమణి డాక్టర్ రాజా ఝాన్సీదేవి అన్నారు. బుధవారం పట్టణంలో పాస్టర్లను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం పోరాటం చేసే మన అభ్యర్థి మల్లురవిని గెలిపించుకునేందుకు ముందుకు రావాలన్నారు. మహిళా సంఘాల ద్వారా వడ్డీలేని రుణాలు అందజేస్తూ మహిళలకు అండగా నిలిచిందన్నారు. పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నాగం శశిధర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాగం శశిధర్‌రెడ్డి

తెలకపల్లి, మే 8 : తెలకపల్లి మండల పరిధిలోని గౌరారం, పర్వతాపూర్ గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగం శశిధర్‌రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి హామీ పని చేస్తున్న కూలీల దగ్గరకు వెళ్లిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఓటు వేసి ఎంపీగా గెలిపించాలని ఆయన కోరారు. బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు అర్థం రవి, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మయ్య, మండల సీనియర్ నాయకులు శ్యామలయ్య వెంకట్‌రెడ్డి, మురళి, కోటేశ్వర్, ప్రభాకర్‌రెడ్డి, రాంరెడ్డి, జంగయ్యభీమయ్య, దామోదర్‌రెడ్డి, విష్ణు, సత్యం, అహ్మద్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

'కేటీఆర్ విమర్శలు అర్థరహితం'



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ అధికార ప్రతినిధి, జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్

కల్వకుర్తి, మే 8 : రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు చేయడం అర్థరహితమని పీసీసీ అధికార ప్రతినిధి, జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ అన్నారు. గతంలో అప్పటి సీఎం కేసీఆర్ రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్ప లేదా అని ఆయన ప్రశ్నించారు. కల్వకుర్తి పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మాజీ జడ్పీటీసీ అశోక్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి చారకొండ వెంకటేష్, పార్లమెంట్ కల్వకుర్తి కో ఆర్డినేటర్ ఇందిరా శోభన్‌తో కలిసి ఠాకూర్ బాలాజీసింగ్ మాట్లాడారు. పీసీసీ అధికార ప్రతినిధి చారకొండ వెంకటేష్, కల్వకుర్తి పార్లమెంట్ కో ఆర్డినేటర్ ఇందిరాశోభన్ మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు కౌన్సిలర్ బాలునాయక్, సంతుయాదవ్, రామస్వామి, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న సీఐ, ఎస్ఐ

కల్వకుర్తి, మే 8 : కల్వకుర్తి సీఐ బి.నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డిలు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

'బీఆర్ఎస్ పాలనలోనే సంక్షేమ పథకాలు'

తిమ్మాజిపేట, మే 8 : బీఆర్ఎస్ పాలనలోనే ప్రతి పేదోడికి సంక్షేమ పథకాలు అమలయ్యాయని బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు జోగు ప్రదీప్ అన్నారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్ బాలరాజు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తిరుతపయ్యగౌడ్, రామస్వామి, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇంటింటి ప్రచారం

చారకొండ, మే 8: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండలంలో కాంగ్రెస్ శ్రేణులు ఎంపీ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలో అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాం గౌడ్, సీపీఐ జిల్లా నాయకుడు డాక్టర్ సీమెచ్ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్, సీపీఐ పార్టీ శ్రేణులు నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పీఏసీఎస్ డైరక్టర్ జగన్‌మోహన్, గజ్జె కొండల్‌గౌడ్, శంకర్‌గౌడ్, జేసీబీ వెంకటయ్యగౌడ్, కందికంటి శ్రీనయ్యగౌడ్, సత్తార్, సీపీఐ మండల కార్యదర్శి ఏసారపు అశోక్‌గౌడ్, సీపీఐ నాయకులు మద్ది నారయణరెడ్డి, జెల్ల బాలయ్యగౌడ్, కొండల్, పాండు పాల్గొన్నారు.

'బీజేపీ పాలనలో అభివృద్ధి కుంటు'

చారకొండ, మే 8: 10 ఏళ్ల బీజేపీ పాలనలో దేశంలో అభివృద్ధి కుంటు పడిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్ అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గం చారకొండ మండలంలోని జూపల్లిలో ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ పాలనలో దేశంలో పేద, మధ్య తరగతి వర్గాలు దెబ్బతిన్నాయని అన్నారు. బుధవారం జూపల్లిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ముస్తఫముజ్జుబాయి, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి జూపల్లి వెంకటయ్యయాదవ్ నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి మల్లు రవిని నాగర్‌కర్నూల్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎలుక రాంచెంద్రి, సీరాజ్, మల్లయ్య, వెంకటయ్య, అక్రం, మల్లికార్జున్, నిరంజన్ పాల్గొన్నారు.

'మనోధైర్యంతో ఎన్నికలను ఎదుర్కోవాలి'

చారకొండ, మే 8: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి బాధను మరిచిపోయి బీఆర్ఎస్ శ్రేణులు మనోధైర్యంతో పార్లమెంట్ ఎన్నికలను ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గజ్జె యాదయ్యగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ శ్రేణులతో కలిసి గజ్జె యాదయ్యగౌడ్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ చండీశ్వర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సవారి జంగయ్యగౌడ్, జంతుక బాలయ్య, సమరంగౌడ్, ఈదమయ్య, కందికంటి శివగౌడ్, గుండె మల్లేష్, రమేష్, కొండల్, శంకర్, ఆంజనేయులు, లింగం తదితరులు పాల్గొన్నారు.

200 రోజుల పని కల్పించాలి

కోడేరు, మే 8 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి 200రోజులు పని కల్పించి రోజు కూలీ 600రూపాయలు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.నరసింహ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎత్తం గ్రామంలో ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలకు సందర్శించి వారి సమస్యలను ఆయన తెలుసుకున్నారు.